# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-03-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జిల్లాల కలెక్టర్లతో ఈరోజు సమావేశమవుతారు.**

**2. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సదుపాయాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ తెలిపారు.**

**3. తెలంగాణ నూతన గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా ఈ రోజు ప్రమాణ స్వీకారం చేస్తారు.**

**4. ఆంధ్రప్రదేశ్ లో లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ -ఎల్పీజీ కొరత లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు, రేపు రెండు రోజుల పాటు జిల్లాల కలెక్టర్లతో సమావేశమవుతారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, స్థూల రాష్ట్ర ఉత్పత్తి- జీఎస్డీపీ వృద్ధి, స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహిస్తారు .పేదరిక నిర్మూలన, నైపుణ్యాభివృద్ధి, జల భద్రత, వ్యవసాయంలో సాంకేతికత వినియోగం వంటి అంశాలపై చర్చ జరగనుంది. అలాగే డిజిటల్ గవర్నెన్స్, ఈ-ఆఫీస్, పెట్టుబడి ప్రతిపాదనల అమలు వంటి అంశాలపై అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేయనున్నారు.

--------------------------

ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలను అందించటంపై దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతి సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో వివిధ ప్రభుత్వ విభాగాల పనితీరు, అందిస్తున్న పౌర సేవలపై సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. విద్యుత్ పంపిణీ సంస్థలు అందిస్తున్న పౌర సేవలు, విద్యుత్ పంపిణీ వ్యవస్థ, పాఠశాల, ఉన్నత విద్య తదితర విభాగాల పనితీరుపై చర్చించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఎనర్జీ ఆడిట్ నిర్వహించి నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి విద్యుత్ సంస్థలను ఆదేశించారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సదుపాయాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలి ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి కోల్ ఇండియా సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత CSR ద్వారా ఏర్పాటు చేసిన వైద్య పరికరాల వివరాలపై ఆయన నిన్న తెనాలిలో పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ,

వాయిస్..25 సెకన్లు

---------------------------

తెలంగాణ నూతన గవర్నర్‌గా నియమితులైన శివ ప్రతాప్ శుక్లా ఈ రోజు హైదరాబాద్ లోని లోక్ భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ ( Aparesh Kumar Singh) ఆయనతో ప్రమాణం చేయించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నారు. ఇందుకు సంబంధించి రాజ్‌భవన్‌లో అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నిన్న శంషాబాద్ విమానాశ్రయంకు చేరుకున్న శివ ప్రతాప్ శుక్లాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాగతం పలికారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన శివ ప్రతాప్ శుక్లా గతంలో కేంద్ర మంత్రిగానూ పనిచేశారు.

---------------------------

14 ఏళ్లు నిండిన బాలికలకు తప్పనిసరిగా హెచ్ పీవీ టీకాను వేయించాలని ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి టి.జి భరత్ తెలిపారు. కర్నూలు నగరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నివారణకు ఏర్పాటు చేసిన హెచ్ పి వి టీకా ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న అన్ని వైద్య సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో దాదాపు 30 వేల మంది బాలికలకు టీకా వేయటానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 32 సెకన్లు

---------------------------

పదవ తరగతి విద్యార్థులందరూ వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో గుంటూరు జిల్లా మంగళగిరి నుంచి అంబేద్కర్ గురుకులాల విద్యార్థులతో దృశ్య మాధ్యమం విధానంలో నిన్న సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులందరు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. పరీక్షల సమయంలో విద్యార్థుల ఆరోగ్యంపై వార్డెన్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ –ఎల్పీజీ కొరత లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరా పరిస్థితిపై శ్రవణ మాధ్యమం విధానంలో అమరావతి

నుంచి ఉన్నతాధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గృహ అవసరాలకు, వాణిజ్య అవసరాలకు సరిపడా గ్యాస్ నిల్వలు రాష్ట్రంలో ఉన్నాయని, ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. గల్ఫ్‌లో యుద్ధ వాతావరణం ఉన్నప్పటికీ రాష్ట్రంలో గ్యాస్ సరఫరాపై ఎలాంటి ప్రభావం లేదని వెల్లడించారు. హెచ్ పిసీ, బీపీసీ, ఐఓసీ సంస్థల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతోందని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో అభివృద్ధితో పాటు సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తున్నామని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రజా సంక్షేమానికి పింఛన్లు, రైతుభరోసా వంటి పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేస్తూనే రాజధాని నిర్మాణాన్ని చేపడుతున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్..25 సెకన్లు

---------------------------

తెలంగాణలో అవయవదానాలను ప్రోత్సహించేందుకు విధివిధానాలను సరళీకృతం చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో 'మానవ అవయవాలు, కణజాలాల మార్పిడి చట్టం' –టీహెచ్ఓటీఏ రూపకల్పన, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం అమలుపై ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో మంత్రి నిన్న సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అవయవదానంలో రాష్ట్రం ఆదర్శంగా నిలిచేలా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు కృషి చేయాలని సూచించారు. అవయవ మార్పిడి శస్త్రచికిత్సలకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను ప్రభుత్వం అందిస్తుంది. చెయ్యి మార్పిడి శస్త్రచికిత్స కోసం రాష్ట్రంలో నాలుగు ఆసుపత్రులకు అనుమతులను ఇచ్చామని మంత్రి తెలిపారు.

---------------------------

దిగువ ట్రోపో ఆవరణలో, ఆంధ్రప్రదేశ్ యానాంలలో నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో పొడి వాతావరణం కొనసాగుతోందని, రానున్న రెండు రోజుల్లో ఉష్ణోగ్రతలు 2, 3 డిగ్రీల సెంటీగ్రేడ్ పెరిగే అవకాశముందని పేర్కొంది.

తెలంగాణా వ్యాప్తంగా పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పలు ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2, 3 డిగ్రీల సెంటిగ్రేడ్ అధికంగా నమోదయ్యే అవకాశముందని పేర్కొంది.

---------------------------

రైతులకు భూ హక్కులపై పూర్తి భద్రత కల్పించేందుకే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాజముద్రతో నూతన పట్టాదారు పాసు పుస్తకాలను అందిస్తున్నామని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.

=====================